తెలంగాణ ఉద్యమ బిడ్డను.. హస్తినకు పంపండి

● బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

చంపాపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ బిడ్డగా తనను ఆశీర్వదించి ఎన్నికల్లో ఎంపీగా గెలిపించి హస్తినకు పంపాలని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హస్తినాపురం డివిజన్‌లోని బీడీరెడ్డి గార్డెన్ నుంచి జడ్పీ రోడ్ మీదుగా శ్రీరమణకాలనీ వరకు నిర్వహించిన రోడ్‌షోలో ఈటల పాల్గొన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రధాని మోడీ వ్యాక్సిన్ ఉచితంగా అందించి ప్రజలను ఆదుకున్నారని అన్నారు. ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా మనిషికి 5కిలోల బియ్యాన్ని ప్రధాని మోడీ ఉచితంగా అందించి కష్టాలలో ఉన్న ప్రజలను ఆదుకున్నారని అన్నారు. హస్తినాపురం డివిజన్ నుంచి తాను ప్రచారం చేపట్టినట్లు ప్రజలు తనకు అత్యధిక మెజార్టీ అందించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తాను తొలి ఆర్థిక మంత్రిగా ఉంటూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలోని పేద విద్యార్థులకు సన్నబియ్యం అందించి ఆదుకున్నట్లు తెలిపారు. దేశాన్ని కాపాడే సత్తా కేవలం మోడీకి మాత్రమే ఉందన్నారు. పేదల కోసం మోడీ ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టినారని, ఆరోగ్య కార్డులు, ఇళ్ల నిర్మాణం, డిజిటల్ ట్రాన్‌జక్షన్, మహిళలకు టాయిలెట్స్ నిర్మాణం వంటివి చేపట్టినట్లు అన్నారు. భారత్ మేకిన్ ఇండియా - మేడిన్ ఇండియాగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు నెలకు రూ.2500 నేటికి ఇవ్వలేకపోయిందని అన్నారు. అంతకు ముందు ఈటల రాజేందర్ చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో స్థానిక కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఈటలకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్‌యాదవ్, ఆయా డివిజన్ కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, పవన్‌కుమార్, రంగ నర్సింహగుప్తా, కొప్పుల నర్సింహారెడ్డి, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, కళ్లెం జీవన్‌రెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బూరం ప్రకాష్, మల్లేష్‌గౌడ్, రాజుగౌడ్, శ్రీదేవి, జీవన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



రాష్ట్ర మేరు సంఘం ఆధ్వర్యంలో టీపీసీసీ ఓబీసీ జనరల్ సెక్రెటరీ పాల్యం శ్రీనివాస్ మేరు సోమవారం చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి మేరు కులస్థులకు రాజ్యసభ సభ్యులుగా, ఎమ్మెల్సీగా, కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఇచ్చి ఆదుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి



నాగోల్ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో నూతనంగా నిర్మించనున్న వేంకటేశ్వర స్వామి, రామాలయం భూమి పూజను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



భూమిక ఉమెన్స్ కలెక్టివ్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్‌నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన సపోర్ట్ సెంటర్‌ను సోమవారం హుస్నాఫాతిమా అనే చిన్నారి ప్రారంభించారు. ఇంత కాలం స్థానిక పోలీస్ స్టేషన్లలో సీడీఈడబ్ల్యూ పేరిట నడిచిన ఈ కేంద్రాలు బస్తీలలో ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. మహిళలు, పిల్లలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఈ సపోర్ట్ సెంటర్ పనిచేస్తుంది. ఎవరికైనా సహాయం కావాలంటే భూమిక హెల్ప్‌లైన్‌కి కాల్ చేసి ఈ సెంటర్‌కు వెళ్లవచ్చని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భూమిక ఫౌండర్ సత్యవతి, భూమిక డైరెక్టర్ ప్రశాంతి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మాధవి, కౌన్సిలర్లు శాంతిప్రియ, రమ్య, పద్మ, కోమలి, కిన్నెర, మీనా, ఫీల్డ్ కోఆర్డినేటర్ ధనలక్ష్మి, అకౌంటెంట్ సాయిరాజు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, బస్తీ మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి

పీవో, ఏపీవోలకు పోలింగ్ విధులపై శిక్షణ

● శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఆర్వో అనుదీప్ దురిశెట్టి


శిక్షణ కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఏఆర్‌వోలు జయశ్రీ, రాజేష్‌కుమార్, నోడల్ ఆఫీసర్ యుగెందర్

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ రోజు విధులు నిర్వహించబోయే పీవో, ఏపీవోలకు సోమవారం మలక్‌పేట ముంతాజ్ కళాశాలలో శిక్షణ ఇచ్చారు. మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 3వందల పోలింగ్ బూత్‌లకు గాను 4వందల మంది పీవోలు, మరో 4వందల మంది ఏపీవోలకు పోలింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. సోమవారం జరిగిన మొదటి విడతలో 2వందల మంది పీవోలు, మరో 2వందల మంది ఏపీవోలకు శిక్షణ ఇచ్చారు. వీరిలో 364 మంది శిక్షణకు హాజరయ్యారు. 36మంది శిక్షణకు గైర్హాజర్ అయ్యారు.

కలెక్టర్ సందర్శన..

మలక్‌పేట ముంతాజ్ కళాశాలలో నిర్వహిస్తున్న పీవో, ఏపీవోల శిక్షణ కేంద్రాన్ని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం సందర్శించారు. పోలింగ్ విధులపై ఇస్తున్న శిక్షణ తీరును ఆయన స్వయంగా పరిశీలించారు. మలక్‌పేట ఏఆర్‌వోలు రాజేష్‌కుమార్, జయశ్రీలు, శిక్షణ నోడల్ ఆఫీసర్ యుగెందర్ రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు. మాస్టర్ ట్రైనర్స్ శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, యామిని, ధనుంజయ, రవికాంత్‌రెడ్డి పోలింగ్ విధులపై శిక్షణ ఇచ్చారు.

ఈవీఎంపై శిక్షణ..

ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ రోజున ఈవీఎంల పనితీరుపై కూడా ఇందులో పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలోని బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్‌ల పనితీరుపై స్వయంగా చూపిస్తూ శిక్షణ ఇచ్చారు.

నేడు రెండో విడత..

మలక్‌పేట ముంతాజ్ కళాశాలలో మంగళవారం రెండో విడత పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండో విడతలో కూడా 2వందల మంది పీవోలు, మరో 2వందల మంది ఏపీవోలకు శిక్షణ ఇవ్వనున్నారు.


తెలంగాణ జట్టు క్రీడాకారులు

జాతీయ సాఫ్ట్‌బాల్ విజేత తెలంగాణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాలికల జట్టు విజేతగా నిలిచింది. సోమవారం ఔరంగాబాద్‌లో ముగిసిన ఫైనల్లో తెలంగాణ 3-1తో పంజాబ్‌ను ఓడించి, ట్రోఫీ దక్కించుకుంది. తెలంగాణ జట్టును సాఫ్ట్‌బాల్ సంఘం అభినందించింది.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి, రవీందర్

చలివేంద్రం ప్రారంభం

చంపాపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చంపాపేట చౌరస్తాలో సోమవారం బైగళ్ల బాబయ్య, పొన్నమ్మ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బైగళ్ల రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ 12 సంవత్సరాల నుంచి ప్రజల దాహార్తి తీర్చుతుండటం పట్ల రవీందర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మీర్‌పేట మున్సిపాలిటీ కార్పొరేటర్లు బైగళ్ల బాలమణి, రాంచందర్, నాయకులు బైగళ్ల అశోక్, యాదగిరి, జగదీశ్వర్, సహదేవ్, వేణు, ఈశ్వర్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● ఐదుగురి అరెస్ట్

సైదాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పూసలబస్తీలో పేకాట స్థావరంపై సోమవారం సైదాబాద్ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి రూ.21,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. పూసలబస్తీలో రాజేష్ అనే వ్యక్తి కొంతకాలంగా ఇంట్లో పేకాట నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇంటిపై దాడి చేసి తన్నీరు శ్రీనివాస్, కోత్తోజు శ్రీశైలం, గుండ్ల జగదీశ్‌బాబు, ఎ.శివకుమార్‌రెడ్డి, రాజేష్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఐదు ఫోన్లు, రూ.21,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మిస్టర్ టీ హోటల్ యజమానిపై కత్తితో దాడి

కొత్తపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలోని హస్తినాపురం మిస్టర్ టీ హోటల్ ఫ్రాంచైజ్ యజమాని నవీన్‌రెడ్డి(30)పై కొందరు వ్యక్తులు పండ్లుకోసే కత్తితో దాడి చేశారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిస్టర్ టీ ఫ్రాంచైజ్ తీసుకుని సూర్యాపేటలో సదరు హోటల్ పెట్టేందుకు నవీన్‌రెడ్డితో సాహెబ్‌నగర్‌కి చెందిన పాలకూరు రాంకుమార్‌గౌడ్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. 2 సంవత్సరాల క్రితం అతడు నవీన్‌రెడ్డికి రూ.3.80లక్షలు చెల్లించాడు. ఒప్పందం ప్రకారం నవీన్‌రెడ్డి వ్యవహరించకపోవడం, డబ్బు తిరిగి చెల్లించకపోవడంతో రాంకుమార్ హోటల్ ఏర్పాటు చేయలేకపోయాడు. అయితే..డబ్బు చెల్లించాలని అడిగిన ప్రతిసారీ రేపు మాపు అంటూ నవీన్‌రెడ్డి దాటేస్తుండడంతో రాంకుమార్ విసుగుచెందాడు. సోమవారం తాడోపేడో తేల్చుకుందామని తన బావమరిది దండు మల్కాపురం వాసి ప్రశాంత్, అదే గ్రామానికి చెందిన రవితేజతో కలిసి హస్తినాపురం, సంతోషిమాత టెంపుల్ కమాను వద్దనున్న మిస్టర్ టీ హోటల్ వద్దకు వచ్చాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వాలని అడిగితే నవీన్‌రెడ్డి నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ.. భార్య శ్రీదేవితో కలిసి కారులో వెళ్లేందుకు యత్నించాడు. దీంతో రాంకుమార్ అతడితో వాగ్వాదానికి దిగాడు. ఈ తరుణంలో ప్రశాంత్ పక్కనే ఉన్న జ్యూస్ సెంటర్‌లో కత్తిని తీసుకొచ్చి నవీన్‌రెడ్డిపై దాడి చేశాడు. నవీన్‌కు ఎడమ చేతి చిటికెన వేలుపై, కుడి మోచేతి పైనా స్వల్ప గాయాలయ్యాయి. తర్వాత నిందితులు అక్కడ్నుంచి వెళ్లి పోయారు. 2022లో నవీన్‌రెడ్డిపై ఆదిభట్ల పీఎస్‌లో కిడ్నాప్ కేసు నమోదైంది. గతేడాది డిసెంబర్‌లోనూ ఎల్బీనగర్ పీఎస్‌లో అతడిపై ఆర్థిక లావాదేవీల కేసు నమోదయినట్లు సమాచారం. నవీన్‌రెడ్డి భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం ప్రారంభం


ఈవెంట్లను వివరిస్తున్న విద్యార్థులు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌డీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ శంకరి

సైదాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్‌లోని భోజిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవం జిజ్ఞాస-2024ను కేంద్ర రక్షణ రంగ సంస్థ డీఆర్‌డీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.శంకరి సోమవారం ప్రారంభించారు. ఈ ఉత్సవాలలో ఏపీ, తమిళనాడు, గుజరాత్, భోపాల్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి 1073 మంది ఔత్సాహిక విద్యార్థులు హాజరయ్యారు. ప్రదర్శనలో అత్యాధునిక ప్రాజెక్టులు, ప్రోటోటైపన్లు ఆవిష్కరించారు. ఇన్ఫోటెక్ వంటి ఈవెంట్లతో విద్యార్థులు సందడి చేశారు. మైండ్‌మేనేజ్ లాంటొ ఛాలెంజ్ టెస్టింగ్, ప్రాబ్లమ్- సాల్వింగ్ సామర్థ్యం, పోస్టర్ ప్రదర్శన ద్వారా సామర్థ్యాన్ని కనబరిచారు.

బహుమతుల ప్రదానం


బహుమతి ప్రదానోత్సవంలో శ్రీనివాస్‌గుప్తా తదితరులు

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ లీగ్ (సౌత్‌జోన్) విజేతలకు బహుమతి ప్రదానోత్సవం నాగోల్ బండ్లగూడలోని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ ఆవరణలో సోమవారం జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు నుంచి 75మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-16, అండర్-18, జూనియర్స్ అండ్ సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొదిస్తాయన్నారు. ఒకరి విజయం మరొకరికి స్ఫూర్తినివ్వాలని అన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ మాక్స్వెల్ ట్రావెర్, జి. కృష్ణమూర్తి, రీజినల్ డైరెక్టర్ జయకుమార్, కమిషనర్ ఓబులేసు, నార్మన్ ఇస్సాక్, నితీష్, అనీల్, గౌతమ్‌రెడ్డి, సుశీల్‌రావు, ఎస్‌కే పాషా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట సర్కిల్-6 ఆస్తి పన్ను వసూలు రూ.34.17కోట్లు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో 2023-24 సంవత్సర కాలానికి ఆస్తి పన్ను రూ.34.17కోట్లు వసూలైంది. సర్కిల్-6 పరిధిలోని ఏడు డివిజన్లలోని గృహాలు, కమర్షియల్ భవనాలు, ప్రభుత్వ భవనాలు కలిపి 56,577 వరకు ఆస్తులు ఉన్నట్లు అధికారిక లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో కేవలం కమర్షియల్ భవనాలు 6,918 వరకు ఉన్నాయి. 2023-24 సంవత్సర కాలానికి గాను సర్కిల్-6లో 56,577 ఆస్తుల నుంచి ఆస్తి పన్నులు రూ.38.18కోట్ల వరకు వసూలు చేయాలని గ్రేటర్ కమిషనర్ టార్గెట్ విధించారు. ఏడు డివిజన్లలో ఆస్తి పన్నుల వసూలు కోసం 8 మంది ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లను నియమించింది. వీరితోపాటు మరో 11మంది బిల్ కలెక్టర్లు పనిచేస్తున్నారు. వీరంతా ఆస్తిపన్ను వసూళ్ల పైనే దృష్టి సారించాల్సి ఉంటుంది. మామూలుగా వీరికి కేవలం ఆస్తిపన్నుల వసూలు బాధ్యతలతోపాటు ఎన్నికల విధులను కూడా అప్పగించడం వల్లే వసూళ్లలో కొంత జాప్యం జరుగుతుంది. ఓటర్ల జాబితా సవరణ, జాబితా పరిశీలన, ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ వంటి విధులను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు నాలుగు నెలల పాటు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ఓటర్ల జాబితా తయారీపైనే అత్యధికంగా దృష్టి సారించాల్సి వచ్చింది. అయినప్పటికీ వీలు కలిగినప్పుడల్లా ఆస్తిపన్నుల వసూలు పైనే దృష్టిని కేంద్రీకరించారు. అయినప్పటికి గ్రేటర్ కమిషనర్ విధించిన టార్గెట్ రూ.38.18కోట్ల వసూలు చేయాల్సి ఉండగా ఫిబ్రవరి మాసాంతానికి రూ.24.27కోట్లను వసూలు చేశారు. తాజాగా పార్లమెంట్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తూ ఎన్నికల కోడ్ అమలు చేసింది. దీంతో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు మళ్లీ ఎన్నికల విధులను నిర్వర్తిస్తూనే ఆస్తి పన్నులను వసూలు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అయినప్పటికీ మార్చిలో రూ.10కోట్లకు పైగా ఆస్తిపన్ను వసూలు చేశారని సర్కిల్-6 డీసీ జయంత్ తెలిపారు.

ఆస్తిపన్ను చెల్లింపులపై 5శాతం రాయితీని సద్వినియోగం చేసుకోండి : కమిషనర్

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి అడ్వాన్స్ ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం 5శాతం రాయితీ అవకాశం కల్పించిందని పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 30 లోగా ఆస్తిపన్ను చెల్లించిన వారికి 5శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. పట్టణ పరిధిలోని గృహ, వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో బిల్ కలెక్టర్లకు పన్ను చెల్లించి రసీదు తీసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నీటి సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉన్నా వెంటనే సంప్రదించాలని కో రారు. సమస్య పరిష్కారానికి 24/7 అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అందుకోసం నలుగురు ప్రత్యేక అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉన్నా ఈ ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

అధికారుల పేరు, ఫోన్ నంబర్లు..

1. భగవంతరావు, జలమండలి, మేనేజర్ - 7995010496
2. రవీంద్రనాథ్‌వర్మ, జలమండలి, డిప్యూటీ జనరల్ మేనేజర్ - 9989989580
3. అశోక్‌కుమార్, డీఈఈ పురపాలక సంఘం - 9440868304
4. రవీందర్‌రెడ్డి, కమిషనర్ పెద్దఅంబర్‌పేట్ - 9030413639

రక్తదానంపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

వనస్థలిపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకుని రక్తదానం చేయాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ చైర్మన్ చేపూరి శంకర్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలో నిర్వహించిన సమావేశానికి జస్టిస్ బి.చంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి ప్రాణం నిలబెట్టడం అనేది చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఆకృతి సుధాకర్, యోగపతి, సీహెచ్. చైతన్య తదితరులు పాల్గొన్నారు.




జనరల్ బాడీ సమావేశంలో బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ఎన్నికల అధికారులు గుర్రం సుధాకర్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు

బార్ అసోసియేషన్ బాధ్యతల స్వీకరణ

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ సోమవారం బాధ్యతలు స్వీకరించింది. జిల్లా కోర్టులో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2022-2023 సంవత్సరానికి జమాఖర్చులు ఆమోదించిన అనంతరం పాత కార్యవర్గం నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పజెప్పింది. కార్యక్రమంలో ఎన్నికల అధికారి గుర్రం సుధాకర్‌రెడ్డి, సహాయ ఎన్నికల అధికారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల కోసం సీఎం ఎంతో కృషి : జితేందర్


ఇఫ్తార్ విందులో జితేందర్ తదితరులు

చంపాపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలతో పాటు చంపాపేటలోని మసీదు వద్ద ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జితేందర్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మతీన్ షరీఫ్, మహ్మద్ వాజీద్, ఎండీ మూసా, నాయకులు బండారు సురేందర్, యాదగిరి పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ మృతి

రాజేంద్రనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్, రంగీలా కుమారి(20) భార్యాభర్తలు. రెండు సంవత్సరాల క్రితం వీరికి వివాహం జరిగింది. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అత్తాపూర్ చింతల్‌మెట్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్ పీర్ గల్లీలో నివాసం ఉంటున్నారు. వీరితో పాటు ప్రవీణ్‌కుమార్ తల్లి కూడా ఉంటుంది. ఆమె కూడా పనికి వెళుతుంది. మూడు నెలల క్రితం రంగీల కుమారికి కొడుకు పుట్టి మరణించాడు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్యం సరిగ్గా ఉండటంలేదు. సోమవారం రంగీల కుమారి పనికి వెళ్లలేదు. తన ఆరోగ్యం బాగాలేదని భర్తతో చెప్పడంతో సాయంత్రం వచ్చి ఆస్పత్రికి తీసుకువెళతానని చెప్పి ప్రవీణ్‌కుమార్ హౌస్ కీపింగ్ పనికి వెళ్లాడు. మధ్యాహ్నాం నాలుగు గంటలకు భార్యకు ఫోన్ చేస్తే ఆమె ఫోన్ తీయలేదు. దీంతో పక్కింటి వారికి చెప్పి చూడాలని కోరాడు. పక్కింటి వారు వెళ్లి చూడగా రంగీల కుమారి చున్నీతో బాత్‌రూమ్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించింది. వెంటనే భర్తకు సమాచారం అందించారు. భర్త వచ్చి అత్తాపూర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసును అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

సరుకు రవాణాలో దక్షిణమధ్యరైల్వే రికార్డు

సికింద్రాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గడిచిన ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణా రంగం, సరుకు రవాణా ఆదాయంలో దక్షిణమధ్యరైల్వే అత్యుత్తమ పనితీరు ప్రదర్శించింది. మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారిగా సరుకు రవాణాలో 140 మిలియన్ టన్నుల మార్కును అధిగమించి 141.117 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్ సాధించింది. గత ఏడాదితో పోలిస్తే 8.785 మిలియన్ టన్నులు అధికం కావడం గమనార్హం. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరంలో సరుకు రవాణా ఆదాయంలో మొట్టమొదటిసారిగా 13వేల కోట్ల రూపాయల మార్కును అధిగమించి, 13,438.76 కోట్ల రూపాయలను ఆర్జించింది. గత ఏడాదితో పోలిస్తే 506 కోట్ల రూపాయలను అధికంగా ఆర్జించడం విశేషం. బొగ్గు, సిమెంట్, ఎరువుల, ఆహార ధాన్యాల రవాణాలో వృద్ధి కారణంగా దక్షిణమధ్యరైల్వే ఈ ఘనత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. జోన్‌లో సరుకు రవాణాలో ప్రధాన వస్తువైన బొగ్గును 2022-23లో 67.18మిలియన్ టన్నులు రవాణా చేయగా, 2023-24లో 70.522 మిలియన్ టన్నుల లోడింగ్ చేసింది. రెండో అతిపెద్ద రవాణా వస్తువైన సిమెంట్‌ను 2022-23లో 34.855 మిలియన్ టన్నుల లోడింగ్ చేయగా, 2023-24లో 36.117 మిలియన్ టన్నుల లోడింగ్ చేసింది.

అంతర్గత విద్యుత్ సమస్యలకు బాధ్యులను చేయొద్దు

● తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్‌యాక్షన్ కమిటీ


సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్‌యాక్షన్ కమిటీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా అంతరాయాలకు తమ తప్పిదం లేకున్నా.. విద్యుత్ సంస్థల యాజమాన్యాల, అధికారుల, ఇంజనీర్ల సిబ్బంది లోపంగా అసత్య ప్రచారం చేస్తూ, అంతర్గత విద్యుత్ సమస్యలకు తమను బాధ్యులను చేయొద్దని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. జేఏసీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ పి.రత్నాకర్‌రావు, కో కన్వీనర్ పి.బీసీ రెడ్డి, వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని కేటగిరీల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు తామంతా అహర్నిశలు కృషిచేస్తున్నామని తెలిపారు. తమకు సంబంధం లేని అంతర్గత సాంకేతిక సమస్యల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడినా, దాన్ని తమ తప్పిందగా చూపిస్తూ తప్పుడుప్రచారం చేయడం విద్యుత్ సిబ్బంది, అధికారుల మనోధైర్యం దెబ్బతీస్తుందని వారు అన్నారు. ప్రస్తుత సీజన్లో అంచనాలకు మించి డిమాండ్ వస్తున్నా తమ సిబ్బంది, ఇంజనీర్ల అనునిత్యం అప్రమత్తంగా ఉంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో గతేడాది 15,497 మెగావాట్లుగా ఉన్న గరిష్ఠ విద్యుత్ డిమాండ్ ఇప్పటికే 15,623 మెగావాట్లకు చేరిందన్నారు. డిమాండ్ పెరిగినా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా పనిచేస్తున్నామన్నాని, భవిష్యత్‌లో మరింత డిమాండ్ పెరిగినా నిరంతర విద్యుత్‌సరఫరా చేస్తామన్నారు.